క్లుప్తంగా

కళాశాలల వద్ద నిఘా



ఎస్సైలతో కలసి మీడియాతో మాట్లాడుతున్న సీఐ అశోక్‌కుమార్

రామచంద్రపురం: పట్టణ పరిధిలో అన్ని కళాశాలలు, పాఠశాలల వద్ద పోలీసులకు మఫ్టీలో పటిష్ట నిఘా ఏర్పాటు చేసినట్లు రామచంద్రపురం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.అశోక్‌కుమార్ తెలిపారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కళాశాలల వద్ద నిబంధనలకు విరుద్ధంగా ఒకే బైక్‌పై ముగ్గురు విద్యార్థులు ప్రయాణిస్తూ ఈవ్‌టీజింగ్‌కు పాల్పడుతున్న వారిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. కె.గంగవరం ఎస్సై జానీబాషా, ద్రాక్షారామ ఎస్సై లక్ష్మణ్, రామచంద్రపురం ఏఎస్సై ఆచారి ఇతర పోలీస్ సిబ్బంది ఆధ్వర్యంలో యువకులను పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చి కౌన్సిలింగ్ ఇచ్చినట్లు సీఐ తెలిపారు. యువకుల తల్లిదండ్రులు కూడా కౌన్సిలింగ్ ఇస్తామని సరైన పత్రాలు లేని వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు ఉంటాయన్నారు. ముగ్గురు నలుగురు ఒకే బైక్ మీద స్పీడుగా ప్రయాణించటం మూలంగా పట్టణంలో ట్రాఫిక్ జామ్ ఏర్పడి పలువురు ప్రమాదాల బారిన పడి గాయాలు పాలవుతున్నారన్నారు. కళాశాల సమయం ముగిసిన వెంటనే ఎవరి ఇళ్లకు వారు వెళ్లిపోవాలని, అలా కాని పక్షంలో కఠిన చర్యలు ఉంటాయని సీఐ హెచ్చరించారు.

ఘనంగా అన్నసమారాధన

కాజులూరు: మండలంలోని గొల్లపాలెం సాయిబాబా ఆలయం వద్ద గురువారం గ్రామస్తులు భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఇటీవల గ్రామంలో సాయి నవరాత్ర కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ఉత్సవాల్లో బాబావారికి వచ్చిన విరాళాలకు తోడు పలువురి దాతల సహకారంతో ఈ అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమైన కార్యక్రమం మధ్యాహ్నం రెండు గంటల వరకూ కొనసాగింది. పరిసర గ్రామాలకు చెందిన సుమారు ఐదు వేల మంది భక్తులు ఈ అన్నదానాల్లో పాల్గొని బాబావారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

పట్టణ పరిశుభ్రతకు కృషి



ఏడిద రోడ్డులో పనులను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ దుర్గారాణి

మండపేట: పట్టణ పరిశుభ్రతకు కృషి చేస్తున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి తెలిపారు. పట్టణంలో ప్రతి ప్రాంతాన్ని శుభ్రంగా తీర్చిదిద్దేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఇందుకు అనుగుణంగా మున్సిపల్ తగిన ఆదేశాలిచ్చామన్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే 8వ వార్డులో ఇందిరాగాంధీ బైపాస్ రోడ్డు శ్మశాన వాటిక వద్ద రోడ్డుకు ఇరువైపులా ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు, తుప్పలను శానిటేషన్ విభాగం తొలగించిందన్నారు. దీనికోసం ప్రత్యేకంగా జేసీబీ ఏర్పాటు చేసి పనులు పూర్తి చేస్తున్నామని తెలిపారు. గురువారం 22వ వార్డు ఏడిద రోడ్డులో పంటకాలువ వెంబడి పెరిగిపోయిన మొక్కలను జేసీబీ సాయంతో తొలగించారు. ఈ పనులను చైర్‌పర్సన్ పరిశీలించారు. రోడ్డు పక్కన ఉన్న మట్టిదిబ్బలను ఎత్తు పల్లాలు లేకుండా చదును చేయించామన్నారు. చైర్‌పర్సన్ వెంట డీఈ శ్రీనివాస్, కౌన్సిలర్ శెట్టి కల్యాణి, వైఎస్సార్ నాయకులు షేక్ అలీఖాన్‌బాబా, ఇన్‌చార్జ్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ముత్యాల సత్తిరాజు ఉన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

రామచంద్రపురం రూరల్: మండలంలో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏఈ ఎం.వెంకటరమణ తెలిపారు. ద్రాక్షారామ సెక్షన్ పరిధిలో 33/11 కేవీ ద్రాక్షారామ సబ్‌స్టేషన్‌లో 11 కేవీ వెల్ల ఫీడర్, 11 కేవీ ద్రాక్షారామ ఫీడర్, 11 కేవీ హసన్‌బాద ఫీడర్, 11 కేవీ వెంకటాయపాలెం ఫీడర్, 11 కేవీ పీడబ్ల్యూస్ ఫీడర్లలో మరమ్మతుల నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రామచంద్రపురం విద్యుత్ ఈఈ రత్నాలరావు ఆదేశాల మేరకు చెట్ల కొమ్మల నరికివేత, మరమ్మతులు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కారణంగా జరుగుతున్న అసౌకర్యానికి వెల్ల, వెల్లసావరం, తాడిపల్లి, కాపవరం, ద్రాక్షారామ, వెంకటాయపాలెం, అన్నాయిపేట, వేగాయమ్మపేట, తాళ్లపాలెం, ఏరుపల్లి, ఆదివారపుపేట, ఉండూరు, భీమక్రోసుపాలెం గ్రామాల విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

నిడసనమెట్టలో రెవెన్యూ సదస్సు

కపిలేశ్వరపురం: భూముల రీసర్వే గ్రామ సభను నిడసనమెట్టలో గురువారం నిర్వహించారు. భూ యాజమానులు తమ సమస్యలపై అధికారులు అర్జీలు అందజేశారు. తహసీల్దార్ చిన్నారావు సమక్షంలో రెవెన్యూ, అనుబంధ శాఖల అధికారులు భూ హక్కుల సమస్యలపై దరఖాస్తులను స్వీకరించారు. రెవెన్యూ, అనుబంధ శాఖల అధికారుల సమక్షంలో వాటిని నమోదు చేశారు. జెడ్పీటీసీ పుట్టపూడి అబ్బు మాట్లాడుతూ శాస్త్రీయ పద్ధతిలో రెవెన్యూ సమస్యలను పరిష్కరించాలన్నారు. దరఖాస్తులను నిర్దేశించిన సమయంలో పరిష్కరించడంలో అధికారులు చిత్తశుద్ధితో వ్యవహరించాలన్నారు.

సేవలకు సెలవేనా..?

- తెరచుకోని ప్రభుత్వ వెబ్‌సైట్లు
- వెలవెలబోతున్న సచివాలయాలు
- అవస్థలు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని ప్రభుత్వం



వెలంపాలెం గ్రామ సచివాలయం

కె.గంగవరం: గ్రామ స్వరాజ్య స్థాపన మహాత్ముని కల. క్షేత్ర స్థాయిలో జరిగే అభివృద్ధే దేశానికి వెన్నెముక అని గాంధీజీ అనేక సందర్భాల్లో తెలిపారు. ఇందుకు అనుగుణంగా మాజీ సీఎం జగన్‌మోహన్ రెడ్డి సచివాలయ వ్యవస్థను రూపొందించారు. లక్షలాది మంది నిరుద్యోగ యువతకు సర్కారు కొలువు అందించారు. పంచాయతీ స్థాయిలో రెండు వేల మంది జనాభాకు ఒక సచివాలయం ఏర్పాటు చేశారు. గ్రామ ప్రజలకు అవసరమైన ప్రతి పనీ స్థానికంగా జరిగేలా చర్యలు తీసుకున్నారు. దీంతో సచివాలయ వ్యవస్థ అనతికాలంలో విజయవంతమైంది. వలంటీర్ల సహకారంతో అర్హులకు ఇళ్ల వద్దే సంక్షేమ పథకాలు అందేవి. అయితే ఇదంతా గతం.. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సంక్షేమానికి తిలోదకాలు ఇచ్చి అవసరమైన విషయాలను తెరపైకి తెచ్చి అసమర్థపాలన చేస్తోంది. ప్రస్తుతం సచివాలయ వ్యవస్థకు తూట్లు పొడుస్తోంది. సచివాలయాల్లో అందే సేవల్లోనూ కోత విధించింది. నిత్యం సందడిగా ఉండే సచివాలయాలు గత నాలుగు నెలలుగా బోసిపోయాయి.

ఎన్నో ప్రయోజనాలు...

నాడు ఎంతో ప్రతిష్టాత్మకంగా సచివాలయాల వ్యవస్థను తీసుకువచ్చారు. దీనికి అనుసంధానంగా వలంటీర్లను నియమించారు. ప్రతి 50 ఇళ్లకు ఒక వలంటీర్ వారి ఇళ్ల వద్దనే సేవలందించేలా చూశారు. సచివాలయాల్లో దాదాపు 545 రకాల సేవలను అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ వ్యవస్థ ప్రజలందరికీ ఎంతో ప్రయోజనకరంగా ఉండేది. వివిధ రకాల ధ్రువీకరణ పత్రాల కోసం మండల కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం ఉండేది కాదు. రిజిస్ట్రేషన్లు కూడా సచివాలయాల్లో నిర్వహించేలా వాటి స్థాయిని పెంచారు.

తెరచుకోని వెబ్ సెట్లు..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సచివాలయాల వైభవం తగ్గిపోయింది. ఇప్పటికే వలంటీర్ల వ్యవస్థ కుదేలు చేసిన కూటమి ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను కూడా నిర్వీర్యం చేసేలా చర్యలు తీసుకుంటోందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో అందించే సేవలను తగ్గించుకుంటూ పోతున్నారు. కులం, ఆదాయం, ఎన్‌బీ ఇతర సాధారణ సేవలు మాత్రమే ప్రస్తుతం సచివాలయాల్లో అందుబాటులో ఉన్నాయి. రేషన్‌కార్డులు, నూతన పింఛన్లు, ఆరోగ్యశ్రీ కార్డుల జారీ, తదితర వెబ్‌సైట్లు గత నాలుగు నెలలుగా ఓపెన్ కావడం లేదు. రామచంద్రపురం, మండపేట నియోజకవర్గంలోని కె.గంగవరం మండలంలో 26 గ్రామాలకు గాను 18 సచివాలయాలు, రామచంద్రపురం రూరల్‌లో 26 గ్రామాలకు గాను 19 సచివాలయాలు, కపిలేశ్వరపురం మండలంలో 19 గ్రామాలకు గాను సచివాలయాలు 20 సచివాలయాలు, రాయవరం మండలంలో 12 గ్రామాలకు గాను 19 సచివాలయాలు, కాజులూరు మండలంలోని 26 గ్రామాలను గాను 19 సచివాలయాలు ఉన్నాయి. వీటిలో దాదాపుగా 1300 మందికి పైగా ఉద్యోగులు పనిచేస్తున్నారు. కూటమి నాయకులు నాడు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సచివాలయ ఉద్యోగులపై అనేక విమర్శలు చేశారు. నేడు కూటమి ప్రభుత్వానికి సచివాలయ ఉద్యోగులే దిక్కుగా మారారు. ముఖ్యంగా సామాజిక పింఛన్ల పంపిణీలో కీలకంగా ఉన్నారు.

అన్ని సేవలు అందించాలి



సచివాలయాల ద్వారా ప్రజలకు అన్ని సేవలు గతంలో మాదిరిగానే అందించాలి. ప్రస్తుతం సచివాలయాల్లో పూర్తి స్థాయిలో పౌరసేవలు అందించడం లేదు. సచివాలయ ఉద్యోగుల్ని కూడా వాలంటీర్లగా కూటమి ప్రభుత్వం మార్చే ప్రయత్నిం చేస్తోంది. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం సచివాలయల వ్యవస్థ పేరును నిలబెట్టే విధంగా ప్రయత్నాలు మొదలు పెట్టాలి.

– బత్తుల అప్పారావు, కుందూరు

వ్యవస్థను మరింత మెరుగ్గా నడిపించాలి



రేషన్, పింఛన్ కార్డులు, ఇతర అవసరాల కోసం ప్రజలు దరఖాస్తులు చేసుకునేలా ప్రభుత్వం విధివిధానాలను రూపొందించి వెబ్‌సైట్లను అందుబాటులోనికి తీసుకురావాలి. వ్యవస్థలను మరింత మెరుగ్గా నడిపిస్తే ప్రజల్లో విశ్వాసం పెరుగుతుంది. అంతే తప్ప గత ప్రభుత్వంపై కక్షతో వారికి పేరు వస్తుందన్న నెపంతో సచివాయాలను నిర్వీర్యం చేసేలా అడుగులు వేయడం సరికాదు.

– వట్టికూటి శేఖర్, ఎంపీపీ మాజీ సభ్యుడు, కె.గంగవరం

28న శ్రీవారి నక్షత్ర కల్యాణం

రాయవరం: స్థానిక ఆలయంలో వేంచేసియున్న శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామికి ఈ నెల 28న నక్షత్ర కల్యాణం నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని వేంకటేశ్వర భక్తజన సంఘం ప్రతినిధులు గురువారం తెలిపారు. ప్రతి మూడు నెలలకొకసారి ఈ నక్షత్ర కల్యాణోత్సవం నిర్వహిస్తామని వారు రాయవరంలో ఆలయం వద్ద నిర్వహించిన సమావేశంలో తెలిపారు. పుబ్బ నక్షత్రంలో నిర్వహించే కల్యాణానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

40 మందికి ఆధార్ నవీకరణ

కపిలేశ్వరపురం: పడమర ఖండ్రిక, కాలేరు, నేలటూరు గ్రామాల్లో గురువారం నిర్వహించిన ఆధార్ నమోదు శిబిరాల్లో 40 మంది ఆధార్ వివరాలను నవీకరించారు. వల్లూరు, టేకి, వల్లూరు సచివాలయాల డిజిటల్ అసిస్టెంట్లు ఇనుమర్తి వీరమల్లేశ్వరరావు, కోరా దొరబాబు, ఫణీంద్ర నవీకరణ ప్రక్రియను చేపట్టారు. ఆరుగురికి కొత్త ఆధార్ నమోదు, 9మంది చిన్నారుల బయోమెట్రిక్, 25 మందికి చెందిన వివరాలను వారి విజ్ఞప్తి మేరకు నవీకరించారు.

విద్యుత్ స్తంభం పక్కకు మార్చరూ..



బియ్యంపేటలో రోడ్డుకు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభం

రామచంద్రపురం రూరల్: మేజర్ పంచాయతీ ద్రాక్షారామలోని బియ్యంపేటలో విద్యుత్ స్తంభం రహదారికి మధ్యలో పేట వాసులకు అసౌకర్యంగా ఉంది. దీంతో స్థానికులు విద్యుత్ స్తంభాన్ని దారికి ఇబ్బంది లేకుండా పక్కకు జరిపించాలని విద్యుత్ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులను కోరుతున్నారు.

రూ.2 కోట్ల అభివృద్ధి పనులకు కౌన్సిల్ ఆమోదం



కౌన్సిల్ సమావేశంలో చైర్‌పర్సన్ శ్రీదేవి, కమిషనర్ నాయుడు

రామచంద్రపురం: పురపాలక పరిధిలోని వార్డుల్లో రూ.2 కోట్లతో జరిగే అభివృద్ధి పనులకు కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. మున్సిపల్ చైర్ పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి అధ్యక్షతన అత్యవసర కౌన్సిల్ సమావేశం గురువారం జరిగింది. తొలుత ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన కౌన్సిలర్ కట్టా శ్రీరాములకు నివాళులర్పిస్తూ కొద్ది సేపు సభ్యులు మౌనం పాటించారు. అజెండాలో మొత్తం 22 పనులకు సంబంధించి 4 అంశాలను సభ్యుల ఆమోదం కోసం ప్రవేశపెట్టారు. 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి వివిధ వార్డుల్లో రూ.2 కోట్లతో నిర్మించే సీసీ రోడ్లు, డ్రైన్లకు సంబంధించిన అంశాలకు సభ్యులు ఆమోదం తెలిపారు. మున్సిపల్ వైస్ చైర్మన్ కోలమూరి శివాజీ మాట్లాడుతూ చేపట్టే పనుల ఏయే పనులు ఎక్కడెక్కడ ఎంతెంత ఖర్చు చేస్తున్నారు అనే విషయాలను తెలియజేయాలని కోరగా వాటిని సభలో కమిషనర్ టీవీపీ నాయుడు ఆదేశాల మేరకు చదివి వినిపించారు. అనంతరం కౌన్సిలర్ వాడ్రేవు సాయిప్రసాద్ మాట్లాడుతూ రోజూ స్థానిక కృత్తివెంటి పేర్రాజు పంతులు క్రీడా ప్రాంగణానికి ఎంతో మంది వాకింగ్ నిమిత్తం లేదా, వివిధ క్రీడలు ఆడేందుకు వస్తుంటారని, గత కొంత కాలంగా కలుపు మొక్కలతో నిండిపోయిందని వాటిని వెంటనే శుభ్రం చేయాలని కోరారు. అయితే గ్రౌండ్‌కు సంబంధించి ఒక ట్రస్టు ఉందని గ్రౌండ్‌ను శుభ్రం చేయాల్సిన పని ట్రస్టుకు ఉందని సాయిప్రసాద్ వివరించారు. మున్సిపాలిటీకి ఎటువంటి సంబంధం లేకపోయిన మున్సిపాలిటీ నిధుల నుంచే ఖర్చు చేయడం జరుగుతుందన్నారు. ఇకపై కృత్తివెంటి ట్రస్టు నుంచి అన్ని రకలుగా శుభ్రం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సాయిప్రసాద్ కోరగా కమిషనర్ స్పందిస్తూ ట్రస్టు ఈవోకు లేఖ రాయాలని అధికారులను ఆదేశించారు. గతంలో ఆమోదించిన మేరకు మున్సిపాలిటీలోని ప్రధాన రహదారిలోని లైటింగ్ పోల్స్‌కు జాతీయ జెండా లైటింగ్‌లను ఏర్పాటు చేయాలని కోరగా వెంటనే చేయాలని చైర్‌పర్సన్ కమిషనర్‌కు సూచించారు. ఇటీవల మున్సిపాలిటీ కార్యాలయానికి కొత్తగా వచ్చిన 14 మంది అధికారులను, సిబ్బందిని సభ్యులకు పరిచయం చేశారు. మున్సిపల్ కౌన్సిలర్‌లు, కో ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్లో డిస్‌ప్లే బోర్డులు పనిచేయక అవస్థలు



ద్వారపూడిలో ఆగిన గౌతమి ఎక్స్‌ప్రెస్

మండపేట: మండలంలోని ద్వారపూడి రైల్వే స్టేషన్లో డిస్‌ప్లే బోర్డులు పనిచేయక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. రైలు వచ్చే సమయానికి ప్లాట్ ఫాం అంతటా కోచ్ ఇండికేటర్లు పని చేస్తేనే ఎస్1, ఎస్2 ఇలా ఏ కోచ్ ఎక్కడ నిలుస్తుందో తెలుస్తుంది. కోచ్ ఇండికేటర్లు పనిచేయక ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. బుధవారం రాత్రి 7.45 నిమిషాలకు వచ్చే కాకినాడ నుంచి లింగంపల్లి వెళ్లే గౌతమి ఎక్స్‌ప్రెస్ ఎనౌన్స్‌మెంట్ సరిగా లేక పోవడంతో తాము ఈ ఆ చివరి వరకూ పరుగులు పెట్టాల్సి వచ్చిందని ప్రయాణికులు తెలిపారు. ఎస్ 1, ఎస్ 2 కోచ్‌లు ఆగే ప్రదేశంలో ఏ1, ఏ2 కోచ్‌లు రావడంతో ఇక్కడ వేచి ఉన్న ప్రయాణికులు పరుగు తీయాల్సి వచ్చింది. సాంకేతిక సమస్య వల్ల కలిగిన అసౌకర్యానికి చింతిస్తున్నామని స్టేషన్ మాస్టారు చెప్పారన్నారు.కోచ్ ఇండికేటర్లు సక్రమంగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు. ప్లాట్‌ఫాంపై అక్కడ అక్కడా బెంచ్‌లు ఉన్న చోట మాత్రమే విద్యుత్ లైట్లు పనిచేస్తున్నాయని ప్రయాణికులు చెప్పారు. రైలు ఇంజన్ దగ్గర నుంచి చివరి పెట్టి వరకూ లైట్లు వెలగక పోతే ప్రయాణికులు ఎక్కడో దూరంగా వెళ్లి నిలబడాలంటే రాత్రిళ్లు భయంభయంగా ఉంటుందని వాపోయారు. నిర్మానుష్యంగా ఉండే చీకటి ప్రాంతంలో రైలు కోసం నిరీక్షించడానికి భయమేస్తోందని ప్రయాణికులు తెలిపారు. మండపేట నియోజకవర్గంలోని 43 గ్రామాలు ప్రజలే కాకుండా చుట్టు పక్కల అనేక గ్రామాల ప్రజలు కూడా ద్వారపూడి రైల్వే స్టేషన్‌ను వినియోగించుకుంటారు. హైదరాబాద్, ఒడిస్సా, కర్ణాటక, వైజాగ్, విజయవాడ ఇలా ఒకటేమిటి అనేక నగరాలకు ఈ ప్రాంతం నుంచి వ్యాపారాలు, పనులు, ఉద్యోగాల నిమిత్తం నిత్యం రాకపోకలు సాగిస్తారు. ఈ స్టేషన్ నిత్యం రద్దీగానే ఉంటుంది. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రయాణికులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని రైల్వే ఉన్నతాధికారులకు పలువురు విజ్ఞప్తి చేశారు.

అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు పథకాలు అమలు చేయాలి



నూతనంగా ఎంపికైన రామచంద్రపురం, కొత్తపేట డివిజన్ మహిళా జేఏసీ నేతలు

రామచంద్రపురం: కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణించాలని వారందరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ అమలు చేయాలని రాష్ట్ర జేఏసీ మహిళా చైర్‌పర్సన్ పి.లక్ష్మి డిమాండ్ చేశారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో ఏపీ జేఏసీ అమరావతి మహిళా విభాగం రామచంద్రపురం, కొత్తపేట జేఏసీ మహిళా విభాగాల సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సమావేశంలో రామచంద్రపురం డివిజన్‌కు సంబంధించి మహిళా జేఏసీ డివిజన్ చైర్‌పర్సన్‌గా లోడ ఝాన్సీ లక్ష్మీకుమారి, అసోసియేట్ చైర్మన్‌గా డి.చైతన్యకుమారి, కో చైర్మన్‌గా కె.విజయరేఖ, ఎం.బిందు, ప్రధాన కార్యదర్శిగా జీఎల్ కుమారి, కార్యదర్శులుగా లక్ష్మీలత, హరిచందన, కోశాధికారిగా పి.పార్వతి ఎంపికయ్యారు. అలాగే కొత్తపేట డివిజన్ విభాగాన్ని ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికై న జేఏసీ మహిళా విభాగం కార్యవర్గం రామచంద్రపురం ఆర్డీవో ఖాతీబ్ కౌసర్ బానోను మర్యాద పూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథులుగా ఏపీజేఏసీ అమరావతి రాష్ట్ర మహిళా విభాగం చైర్‌పర్సన్ పి.లక్ష్మి, సెక్రటరీ సునీత హాజరయ్యారు. వారు మాట్లాడుతూ మహిళలు ప్రతి విభాగంలోనూ పురుషులతో సమానంగా పని చేస్తున్నారని, అయినా కొన్ని చోట్ల వివక్ష, వేధింపులను ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే 12వ పీఆర్సీని అమలు చేయాలన్నారు. ప్రభుత్వంలో ఖాళీలు ఎక్కువగా ఉన్న కారణంగా కాంట్రాక్ట్ ఉద్యోగులను వెంటనే రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. కో చైర్‌పర్సన్లు శారద, అనురాధ, కార్యదర్శులు సుజాత, పద్మావతి, ప్రియాంక, శైలజ తదితరులు పాల్గొన్నారు.

శ్రీనుకు ఎమ్మెల్సీ తోట పరామర్శ



అధికారి శ్రీనును పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ తోట

మండపేట: పితృ వియోగంతో బాధపడుతున్న వైఎస్సార్ సీపీ టౌన్ కోశాధికారి అధికారి శ్రీనును గురువారం ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పరామర్శించారు. ఆయనతో పాటు వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాధాకృష్ణ ఉన్నారు. అక్కలవారి వీధి ఎదురుగా గల చిన్నవీధిలో నివాసముంటున్న శ్రీను ఇంటికి తోట వెళ్లి పరామర్శించారు. స్వర్గీయ సత్తిరాజు చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం వస్త్ర వ్యాపారి మీరాబి సతీమణి ఇటీవల మరణించడంతో వారి కుటుంబబసభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. ఎమ్మెల్సీ వెంట జిన్నూరి సత్యసాయిబాబా, రుద్రయ్య చౌదరి, పార్టీ టౌన్ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజు, కోళ్ల శ్రీనివాస్, గనిపే ఆనంద్, శాకా సత్యనారాయణ, తుణుకు అశోక్, శెట్టి ఆనంద్ తదితరులు ఉన్నారు.

పసలపూడికి ఎమ్మెల్సీ త్రిమూర్తులు పరామర్శ

కపిలేశ్వరపురం: పితృవియోగంతో బాధపడుతున్న, అంగరకు చెందిన వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు పసలపూడి శ్రీనివాస్‌ను తన నివాసంలో గురువారం ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పరామర్శించారు. ఇటీవల శ్రీనివాస్ తండ్రి సుబ్బారావు వృద్ధాప్యంతో మృతి చెందారు. శ్రీనివాస్‌తోపాటు సోదరుడు సర్వేశ్వరరావు తదితర కుటుంబ సభ్యులను ఎమ్మెల్సీ తోట పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. జెడ్పీటీసీ పుట్టపూడి అబ్బు, ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, సర్పంచ్ తిరునాతి ఆదిలక్ష్మి, నాయకులు తిరునాతి వెంకటేశ్వరరావు, మేడిశెట్టి దుర్గారావు, కవల రాజు, నేల సూర్యకుమార్ ఉన్నారు.

వ్యాపార కేంద్రాలను తనిఖీ చేస్తాం

- వ్యాపారులు ట్రేడ్ లైసెన్స్ కలిగి ఉండాలి
- కమిషనర్ రంగారావు



సచివాలయ సిబ్బందికి ఆదేశాలిస్తున్న కమిషనర్ రంగారావు

మండపేట: మండపేటలో వ్యాపారాలు సాగించే ప్రతి వ్యాపారి ట్రేడ్ లైసెన్స్ కలిగి ఉండాలని మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు తెలియజేశారు. మున్సిపల్ కార్యాలయంలో గురువారం ఆయన చాంబర్‌లో శానిటేషన్, సచివాలయ శానిటేషన్ సెక్రటరీలతో ఆయన సమావేశం నిర్వహించారు. వ్యాపార కేంద్రాల వద్దకు తనిఖీలు చేపట్టే విధానంపై కమిషనర్ వారికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ రంగారావు మాట్లాడుతూ మండపేటలోని అన్ని హోటళ్లు, రెస్టారెంట్లలో తనిఖీలు చేపట్టాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఫ్రీజర్లలో నిల్వ ఉంచిన ఆహార పదార్థాలను, మాంసాలను గుర్తించి నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలన్నారు. వివిధ వ్యాపారాలు సాగించే వ్యాపార కేంద్రాల వద్దకు అధికారులు వెళ్లి తప్పని సరిగా ట్రేడ్ లైసెన్స్ పొందాలని వ్యాపారులకు తెలపాలన్నారు. హోటల్స్ వద్ద తనిఖీ రిజిస్టర్ ఏర్పాటు చేయాలని సూచించాలన్నారు. అధికారులు తనిఖీలు చేపట్టినప్పుడు రిజిస్టర్ చూపించాలన్నారు. అందులో పనిచేసే వంట వారికి, వర్కర్లకు తప్పని సరిగా హెల్త్ సర్టిఫికెట్లు ఉండాలన్నారు. బార్ అండ్ రెస్టారెంట్లతో సహా ఈ నిబంధనలు పాటించాలన్నారు. మెప్మా సిబ్బంది రోజు వార్డులో తడి,పొడి చెత్త సేకరణపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ప్లాస్టిక్ నిర్మూలనలో భాగంగా దుకాణాల్లో ప్లాస్టిక్ కవర్ల తనిఖీలు చేపట్టాలన్నారు. సమావేశంలో మెప్మా సిటీ మిషన్ మేనేజర్ పెండ్యాల సుజాత, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అవార్డులు బాధ్యతను పెంచుతాయి



జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు, స్థానికులు

కాజులూరు: విధి నిర్వహణలో ఉన్న ప్రభుత్వ ఉద్యోగులకు అవార్డులు మరింత బాధ్యతను పెంచుతాయని ఎంఈఓ జె.డేవిడ్ అన్నారు. ఈ ఏడాది మండల గ్రామాల నుంచి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికై సెప్టెంబర్ ఐదో తేదీన అవార్డులు అందుకున్న కాజులూరు జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం పంపన కృష్ణమూర్తి, భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు చింతా నారాయణమూర్తిలను గురువారం పాఠశాలలో ఉపాధ్యాయ సిబ్బంది, స్థానికులు ఘన సత్కరించారు. ఎంఈఓలు జె.డేవిడ్, పి.జాన్ మాట్లాడుతూ పాఠశాలలలో విద్యాభివృద్ధికి హెచ్ఎం పంపన కృష్ణమూర్తి, భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు చింతా నారాయణ మూర్తి చేస్తున్న సేవలను కొనియాడారు. కార్యక్రమంలో స్టాఫ్ సెక్రటరీ కె.హరినాథ్, ఫస్ట్ అసిస్టెంట్ జె.శామ్యూల్‌బెన్‌హర్, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ పి.పద్దరాజు, అయితపూడి స్కూల్ హెచ్ఎం పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

బాలికలు అప్రమత్తంగా ఉండాలి



ద్రాక్షారామ జెడ్పీ హైస్కూల్లో విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై

రామచంద్రపురం రూరల్: బాలికల విద్యా వ్యవహారాల్లో ఏమైనా ఆటంకం కలిగించేలా వారిపై తప్పుడు ప్రవర్తనకు పాల్పడినా, ఈవ్ టీజింగ్ చేసినా కఠిన చర్యలు తప్పవని ద్రాక్షారామ ఎస్సై ఎం. లక్ష్మణ్ హెచ్చరించారు. ద్రాక్షారామ జెడ్పీ హైస్కూల్‌లో బాలికలపై జరుగుతున్న అకృత్యాలు, వాటిని ఎలా ఎదుర్కోవాలి అనే అంశాలపై విద్యార్థినులకు ఎస్సై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థినులు తమకు ఎటువంటి ఇబ్బందికరమైన పరిస్థితులు ఎదురైనా వెంటనే 100, 102 నంబర్లకు ఫోన్ చేయడం ద్వారా పోలీసుల నుంచి తక్షణ సాయం అందుకోవచ్చని సూచించారు. హైస్కూల్స్, కళాశాలల ప్రాంతాల్లో తమ పోలీసులు నిత్యం మఫ్టీలో తిరుగుతూ ఉంటారని, బాలికలపై ఎవరైనా అభ్యంతరకరంగా ప్రవర్తిస్తే వారికి చట్టపరమైన శిక్షలు పడేలా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సెల్‌ఫోన్లు అనేక సమస్యలకు కారణమవుతున్నాయన్నారు. సెల్‌ఫోన్లు వాడేటప్పుడు ఫోన్ కాల్స్ ద్వారా, సోషల్‌మీడియా యాప్స్ ద్వారా అపరిచితులతో పరిచయాలు పెంచుకోవద్దని సూచించారు. చిన్నచిన్న పొరబాట్లు కూడా చాలా పెద్ద సమస్యలకు దారి తీస్తున్నాయని ఉదాహరణలతో వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయిని వాడ్రేవు రత్నపద్మావతి, జిల్లా సైన్స్ అధికారి గిరజాల వెంకట సత్య సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు అవర విస్సు, పసుపులేటి మెహర్ సుజాత, వ్యాయామోపాధ్యాయిని తోట నాగమణి, మహిళా పోలీసులు ప్రియాంక, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ హామీలను నెరవేర్చాలి



మాట్లాడుతున్న వెంకన్నబాబు

మండపేట: అమలు కాని హామీలు గుప్పించి కూటమి ప్రభుత్వం ప్రజలను మోసగించిందని వైఎస్సార్‌సీపీ జేసీఎస్ కన్వీనర్ యరమాటి వెంకన్నబాబు విమర్శించారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనకు అర్థం చెప్పారన్నారు. ఆయన పాలన పక్క రాష్ట్రాలకు కూడా ఆదర్శవంతమైందన్నారు. ప్రజలకిచ్చిన హామీలను 99 శాతం నెరవేర్చిన ఘనత జగన్‌కే దక్కిందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మహిళలకు పెద్దపీట వేసిందని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం మహిళల విషయంలో సవతి తల్లి ప్రేమ చూపిస్తోందని ఆరోపించారు. మోసపూరిత వాగ్దానాలతో చంద్రబాబు గద్దె నెక్కి పేద ప్రజలకు మొండి చేయి చూపించారని ధ్వజమెత్తారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణమని చెప్పిన హామీ నెరవేర్చారా అని ప్రశ్నించారు. ఈ ఖరీఫ్ సీజన్లో పెట్టుబడి సాయం కింద రైతులకు ఇస్తానన్న రూ.20 వేలు ఊసే లేదని విమర్శించారు. తల్లికి వందనం ఏమైందని నిలదీశారు. తల్లిదండ్రులు తమ పిల్లలను చదివించు కోవడానికి ఆర్థికంగా ఇబ్బందులు పడుతుంటే ప్రభుత్వానికి పట్టదా అని వెంకన్నబాబు ప్రశ్నించారు. కాలయాపన చేయకుండా సూపర్ సిక్స్ హామీలను నెరవేర్చి చిత్తశుద్ధిని చాటుకోవాలని వెంకన్నబాబు ప్రభుత్వానికి హితవు పలికారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ రామకృష్ణ

మండపేట: మండపేట టౌన్, రూరల్ పరిధిలో బాణసంచా దుకాణదారులు తప్పని సరిగా అనుమతులు పొందాలని రామచంద్రపురం డీఎస్పీ బీ రామకృష్ణ అన్నారు. కచ్చితంగా పోలీసు నిబంధనలు పాటించాలని, లేని పక్షంలో నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గురువారం పట్టణ పోలీస్ స్టేషన్‌లో బాణసంచా తయారీ, దుకాణదారులతో సమావేశం నిర్వహించారు. రూరల్ సీఐ పీతల దొరరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో డీఎస్పీ రామకృష్ణ హాజరై వ్యాపారులు, బాణసంచా తయారీదారులకు నియమ నిబంధనలు వివరించారు. దీపావళి పండుగ సమీపిస్తున్న వేళ దుకాణాలు ఏర్పాటు చేసే వారంతా తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన చర్యలు వివరించారు. అగ్ని ప్రమాదం జరిగినప్పుడు ఫైర్ సిలిండర్‌ను ఎలా వినియోగించాలనేది అగ్నిమాపక అధికారి హనుమంతరావు సిలిండర్ ఓపెన్ చేసి చూపించారు. వ్యాపారులు సంబంధిత శాఖల ద్వారా అనుమతులు తీసుకోవాలన్నారు. బాణసంచా షాపులు నిర్దేశించిన ప్రదేశంలో మాత్రమే ఏర్పాటు చేసుకోవాలన్నారు. లైసెన్సు లేకుండా వ్యాపారాలు సాగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ తెలిపారు. సమావేశంలో టౌన్ రూరల్ ఎస్సైలు హరికోటి శాస్త్రి, డి సురేష్‌బాబు, అగ్నిమాపక అధికారి హనుమంతరావు, వ్యాపారులు ఎస్ఎన్‌కే నాగన్న పాల్గొన్నారు.